క్లుప్తంగా

రైతుబీమాకు 648 దరఖాస్తులు



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమాకు సంబంధించి కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు జులై 20 నుంచి నేటి వరకు 648 మంది దరఖాస్తులు చేసుకున్నారని మండల వ్యవసాయఅధికారి వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓలు మహేశ్వరి, సింధూజ చివరిరోజు దరకాస్తులు స్వీకరించారు.

అంకితభావంతో పనిచేయాలి



కొత్తకోట: పట్టణ కేంద్రానికి చెందిన దేశి శాంతన్న, నారామ్మ దంపతులు కుమారుడు శివయాదవ్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ)గా ఉద్యోగం సాధించాడు. కాంగ్రెస్ నాయకులు సోమవారం శివయాదవ్ ఇంటికి వెళ్లి పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. విధుల్లో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, పి.కృష్ణారెడ్డి, బోయేజ్, డాక్టర్ పీజే బాబు, రాములుసాగర్, బీచుపల్లి యాదవ్, సంద వెంకటేష్ ఉన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు కమిటీ ఏర్పాటు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ట కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా విప్పటూరి విక్రం, ఆగారం ప్రకాష్, క్యామ రాజు అధ్యక్షుడు పాలవాది రాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, మల్లిగాళ్ల అశోక్, గంగారవు, చెన్నూరు ఆశన్న, పొయ్యికాడి చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా కొరిగెల గోపి, కోశాధికారి చిట్యాల లింగస్వామి పటేల్, సంయుక్త కార్యదర్శులు గగ్గలపల్లి లక్ష్మారెడ్డి, వెంకట్రాములు, సలహాదారులు పోలిశెట్టి శ్రీను, గోనెల శ్రీను, బెస్త అంజనేయులు, బండారి యాదగిరి, నర్సింహ, జయబాబు, శాంతయ్య, బుచ్చిబాబుగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి గోపి తెలిపారు. శివాజీ విగ్రహ ప్రతిష్ట కోసం కమిటీ పని చేస్తుందన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం పట్టణానికి చెందిన మహ్మద్‌కు మంజూరయిన రూ.10 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు, శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి చెందిన మేకల నాగన్నకు రూ.16 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం వనపర్తిలో ఇంటి వద్ద రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్లస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, కుమ్మరి గోవిందు, మద్దిలేటి పాల్గొన్నారు.

యువత ఆర్థికసాయం



కొత్తకోట రూరల్: మండలందిలో పామాపురం గ్రామానికి చెందిన మండ్ల మన్నెమ్మ(65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. గ్రామంలోని 2వ వార్డుకు చెందిన యువకులు తమ వార్డులో ఎవరు చనిపోయిన వారికి ఆర్థికసాయం చేయాలని గతంలో నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా సోమవారం మృతి చెందిన మండ్ల మన్నెమ్మ కుటుంబ సభ్యులకు రూ.15,500 అందజేశారు.

'న్యాస్' పరీక్షలపై శిక్షణ

పాన్‌గల్: విద్యార్థులను జాతీయ సాధన సర్వే (న్యాస్) పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల కాంప్లె క్స్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టుపై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణను ఆయన సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులకు శిక్షణపై ఆర్పీలు అవగాహన కల్పించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం నరేందర్, ఆర్పీలు, డీఈఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెద్దగూడెంలో మొక్కలు నాటుతున్న ఆర్డీఓ పద్మావతి



మదనాపురంలో..



గోపాల్‌పేటలో..

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, పచ్చదనంతోనే జీవ జాతులకు మనుగడ ఉందని ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, చైర్‌పర్సన్ గాయత్రి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, కమిషనర్ నాగరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సోమవారం చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు అన్నారు.

మదనాపురం: పచ్చదనం పరిశుభ్రత పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్ కోరారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ విద్యార్థులతో కలిసి అధికారులు స్వచ్ఛత ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహంలింకన్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, హెచ్ఎం మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి విష్ణు ఉన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఎంపీడీఓ శేఖర్,



అమరచింతలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్, ఎస్ఐ హరిప్రసాద్ పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛదనం, పచ్చదనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి బస్టాండు వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

పాన్‌గల్: వాతావరణంలో సమతుల్యతను కాపాడేందుకు చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి, ఎంపీడీఓ గోవింద్‌రావు, పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: గ్రామాల్లో పచ్చదనాన్ని పరిరక్షించాలంటే ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పనిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, కళాశాల, పాఠశాల విద్యార్థులు గ్రామంలోని పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు.

పెబ్బేరు రూరల్: ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రం ఉంచుకోవాలని ఆర్డీఓ పద్మావతి సూచించారు. పెబ్బేరు, శ్రీరంగాపూర్, వనపర్తి మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామంలో ఆర్డీఓ పద్మావతి, ఎంపీడీఓ రాఘవ, అధికారులు, విద్యార్థులు ముళ్ల పొదలు తొలగించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ సుదర్శన్, కార్యదర్శి మద్దిలేటి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అమరచింత: వాతవరణంలోని కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కల సంరక్షణతోనే సాధ్యమవుతుందని, పర్యావరణ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కదలి రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, స్పెషల్ ఆఫీసర్లు మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప, డీపీఓ రమణ అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రార్థన మందిరాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలతో పాటు చెత్తను తొలగించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జీఎస్ గోపి, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో..



నాగల్‌కడ్మూర్‌లో డీపీఓ రమణమూర్తి



పాన్‌గల్‌లో..



ఆత్మకూర్‌లో..

బైక్ దొంగతనం కేసులో నిందితుడికి శిక్ష

మదనాపురం: మండలంలోని దంతనూరు గ్రామానికి చెందిన బైకు దొంగతనం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష పడింది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం దంతనూరు గ్రామానికి చెందిన క్యాసాని మాసన్న 7మార్చి, 2024న రాత్రి తన ఇంటి ముందు బైకు ఆపి పడుకున్నారు. ఉదయం లేచి చూసుకునే సరికి బైక్ కనబడలేదు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 8మార్చి 2024న దంతనూరు చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా.. బైక్‌పై వస్తున్న వ్యక్తి పోలీసులను గమనించి బైక్‌ను వదిలి పారిపోయాడు. పోలీసులు పట్టుకొని విచారించగా.. కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన మల్లిక సురేష్ అలియస్ శ్యాం గా గుర్తించారు. తానే బైక్ దొంగతనం చేశానని నిందితుడు ఒప్పుకున్నాడు. దీంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. సోమవారం ఆత్మకూరు మొదటి అడిషనల్ కోర్టులో వనపర్తి అడిషనల్ జడ్జి జానకి నేరస్తుడికి ఆరు నెలల జైలు శిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం



అమరచింత: కొడుకు కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేసిన ఘటన మండలంలోని ధర్మాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ పెద్దమల్లన్న కుమారుడు కుర్వ వెంకటేష్ ఆదివారం నుంచి కనిపించడం లేదని పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఏఎస్ఐ జమీరుద్దీన్ మాట్లాడుతూ.. మల్లన్న తన కుమారుడికి గ్రామంలోని చేళ్లలో తమ గొర్రె పిల్లలు ఉన్నాయని వాటిని ఇంటికి తీసుకురమ్మని చెప్పడం జరిగిందన్నారు. గొర్రె పిల్లల కోసం ఆదివారం ఇంటి నుండి బయటికి వెళ్లిన వెంకటేష్ సోమవారం సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. చుట్టు పక్కల వెతికినా కనిపించక పోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రక్త నమూనాల సేకరణ

పెబ్బేరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీరంగాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రక్త నమూనాల సేకరణ ప్రారంభించినట్లు జిల్లా వైద్యాధికారి డా. జయచంద్రమోహన్ తెలిపారు. సేకరించిన నమూనాలను జిల్లాకేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రానికి పంపించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 52 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని.. మండల ప్రజలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



ఆందోళన చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

వనపర్తి టౌన్: బంగారం దొంగతనం చేసిందనే నెపంతో దళిత మహిళ సునీతను రాత్రి వేళలో పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి చిత్రహింసలకు చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు సునీతకు న్యాయం జరగాలని సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో కేవీపీఎస్, ఐద్వా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సునీత ఇంటి పక్కన నాగేందర్ అనే వ్యక్తి ఇంట్లో బంగారు దొంగలించిందనే నెపంతో రాత్రి 8గంటలకు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కర్రలతో కొట్టి చిత్రహింసలు చేయడం ఏంటని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భగత్, సాయిలీల, వెంకట్రాములు, రాజేష్, శరత్, బీసన్న, బాలరెడ్డి, కృష్ణ, కవిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ



అమరచింత: పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సోమవారం డీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా షూస్ పంపిణీ చేశారు. పాఠశాలలకు ప్రతి ఏడాది డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్‌రెడ్డి క్రమం తప్పకుండా విద్యార్థులందరికీ ఉచితంగా రెండు జతల షూస్ అందిస్తారని దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కలాం పాషా తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కళావతమ్మ, ఉపాధ్యాయులు పద్మ, హరిత, శ్రావణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

అమరచింత: కేరళ వరద బాధితుల సహాయ నిధి కోసం కోసం సోమవారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించామని సీపీఎం మండల కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి తెలిపారు. పట్టణంలోని వివిధ దుకాణ సముదాయాలతో పాటు చిరు వ్యాపారులను సంప్రదించగా.. వారికి తోచినంత సాయం చేశారని పేర్కొన్నారు. పట్టణం మొత్తంలో రూ.9,542 సేకరించామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహా కార్యదర్శి ఆర్ఎస్ రమేష్, వెంకటేష్, అజయ్, బుచ్చన్న, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో కురిసిన అకాల వర్షాలకు సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు మండల కేంద్రంలో



అమరచింతలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం నాయకులు విరాళాలు సేకరించారు. రూ.3,600 పోగు చేసి బాధితులకు పంపిస్తున్నట్లు సీపీఎం మండల కమిటీ కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఆశన్న, వెంకటేశ్వర్ల గౌడ్, రాముడు, రామకృష్ణ, రఘు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు చెల్లించాలి

వనపర్తి/వనపర్తి టౌన్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం పీడీఎస్‌యూ నాయకులు విద్యార్థులతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ఆదర్శ్‌సురభికి అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి పి.గణేష్, జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యా వ్యవస్థను బాగు పరుస్తామని హామీలిచ్చిన కాంగ్రెస్ పట్టనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గణేష్, వెంకటేష్, సందీప్, గోవర్ధన్, దినేష్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి: సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం విద్యార్థులు కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు భగత్ మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లను సందర్శించి సమస్యలపై అధ్యయనం చేశామని, పరిష్కరించే వరకు విద్యార్థులతో కలిసి పోరాడుతామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండునెలలు గడుస్తున్నా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు ఇవ్వలేదని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్స్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గంధం ఘట్టన్న, బీసన్న, శరత్, రాజేష్, డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు మెటీరియల్‌ను వెంటనే అందజేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి యూసుఫ్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆత్మకూర్‌లోని బీసీ, ఎస్సీ బాలుర హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇంకా దుప్పట్లు, నోట్‌బుక్కులు, కాస్మోటిక్ చార్జీలు ఇవ్వక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమీర్, జిలాని, చరణ్, పాష, వసీం ఉన్నారు.

బీటీ రోడ్డు పునర్నిర్మించాలని పాదయాత్ర

వనపర్తి: 23 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న రేమద్దుల–వనపర్తి బీటీ రోడ్డును పునఃనిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ హాజరై రేమద్దుల నుంచి వనపర్తి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం రోడ్డును పునఃనిర్మాణం చేయించాలని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాన్‌గల్ మండలంలోనే మేజర్ గ్రామ పంచాయతీ అయిన రేమద్దుల నుంచి నిత్యం విద్యార్థులు, రైతులు, వ్యాపార, ఇతర పనుల నిమిత్తం వందల సంఖ్యలో జిల్లా కేంద్రానికి వస్తుంటారని తెలిపారు. అలాంటి రోడ్డును ఏళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేయటం ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల ఆర్టీసీ బస్సులు సైతం తగ్గించారని, ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణం పనులు వెంటనే చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మెంటపల్లి పురుషోత్తంరెడ్డి, దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, బండారు కుమారస్వామి, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, గ్రామస్తులు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లాలోని గాజువాకలో ఈనెల 4, 5న నిర్వహించిన గ్రాండ్ కరాటే చాంపియన్‌షిప్, అమరపాని శ్రీనివాస్‌రావు మెమోరియల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించగా కొత్తకోటలోని గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు బంగారు, వెండి పథకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 3వేలకు పైగా విద్యార్థులు పాల్గొనగా.. తమ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు అండర్–10 కుమితే విభాగంలో కె.దుర్గాప్రసాద్‌చారి, అండర్–12 కుమితే విభాగంలో ఎం.విజయ్‌కుమార్ బంగారు పథకాలు సాధించగా.. అండర్–19 కుమితే విభాగంలో తరుణ్ వెండి పథకం సాధించారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పథకాలతో పాటు సర్టిఫికెట్లను అందజేసినట్లు అబ్దుల్‌నబీ తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

కాంగ్రెస్‌ది రజాకార్ల పాలన

వనపర్తి టౌన్: కాంగ్రెస్‌పార్టీ రజాకార్ల పాలన సాగిస్తుండటంతో ప్రజలు బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, పట్టణ అధ్యక్షుడు బచ్చురాం అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు న్యాయం జరగలేదని, దళితబంధు ఇస్తామని చెప్పి గద్దెనెక్కి దళితులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను తిట్టిన కేసీఆర్ మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో అతడినే ఎందుకు నిలబెట్టిందో వారికే తెలియాలన్నారు.

ఎన్నికైన కార్యవర్గం..

జిల్లా కార్యవర్గసభ్యుడిగా కె.రాము, పట్టణ ప్రధాన కార్యదర్శులుగా నవీన్‌చారి, అరవింద్, పట్టణ కార్యదర్శిగా రణధీర్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా ఎస్.రవికుమార్, పట్టణ అధ్యక్షుడిగా చాణక్య, కిసాన్‌మోర్చా పట్టణ అధ్యక్షుడిగా రాఘవేందర్ ఎన్నిక కాగా.. వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ ఇన్‌చార్జ్ శ్రీశైలం, నాయకులు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

పుట్టిన శిశువుకు తల్లిపాలు తాగించాలి



కేతేపల్లిలో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూర్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని జూరాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, కార్యదర్శి దాసు, అంగన్‌వాడీ టీచర్లు సారక్రిస్టల్, భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు అమృతం లాంటివని, జన్మనించిన బిడ్డకు గంటలోపు తల్లి పాలు పట్టించాలని సూచించారు. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందిస్తాయన్నారు.

వీపనగండ్ల: తల్లిపాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముర్రు పాల వల్ల పసిపిల్లలు ఆరోగ్యవంతంగా పెరగడమే కాకుండా సృజనాత్మక శక్తి కలిగి ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, ఎల్లమ్మ, మహేశ్వరి, కమల, ఆశావర్కర్లు రాధా, రాణి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: అప్పుడే పుట్టిన చిన్నారులకు తల్లిపాలు పట్టించడం ద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శారద, అంగన్‌వాడీ టీచర్లు నాగేంద్రమ్మ, రాధిక, బాలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



జూరాలలో..

'రైతుల చెంతకే బ్యాంకర్లు'

వనపర్తి టౌన్: పంద్రాగస్టు లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం డబ్బును సమకూర్చుకుంటుందని, ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయగానే రైతుల ఇంటికే బ్యాంకర్లు వెళ్లి పాస్‌బుక్‌లను అందించే రోజులను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారని తెలిపారు. యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ ప్రకటించిన ఏకైక రాష్ట్రంగా దేశంలో తెలంగాణ నిలుస్తుందన్నారు. స్థలం ఉన్న వారికి ఈనెల ఆఖరి వరకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తారన్నారు. వచ్చే ఏడాది స్థలం లేని వారికి సైతం స్థలంతో ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను లోకల్, నాన్ లోకల్ ప్రజలకు సమ ప్రాధాన్యతతో అప్పగించేందుకు కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. వనపర్తిలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ఐటీఐ కళాశాల పక్కనే రూ. 5కోట్లతో అధునాత యంత్రాలతో విభిన్న కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. అనంతరం 36 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మర్‌మియా, కిరణ్‌కుమార్, బి.కృష్ణ, కొట్ల రవి, బాబా, రాములు, విజయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న చిన్నారెడ్డి